సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



గొల్ల, కురుమల అభ్యున్నతికి కృషి

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు.

వివరాలు 03లో ▸



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 03లో ▸



అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 03లో ▸

న్యూస్‌రీల్

ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో బీఎంఎస్ విజయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలపరిధిలోని అంకెనపల్లి శివారులో గల ఎంఆర్‌ఎఫ్ (ఎపీఎల్) లిమిటెడ్ పరిశ్రమలో శనివారం జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ అభ్యర్థి ఎస్.మల్లేశం విజయం సాధించారు. మొత్తం 676 ఓట్లు ఉండగా 664 ఓట్లు పోలయ్యాయి. అందులో బీఎంఎస్‌కు 396, సీఐటీయూకు 236, కార్మిక రక్షణ సమితికి 30, చెల్లనివి రెండు, మరో 12 మంది కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనలేదు. కాగా, సీఐటీయూ అభ్యర్థిపై బీఎంఎస్ అభ్యర్థి మల్లేశం 160 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో కార్మికులు పరిశ్రమ ఎదుట టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని మల్లేశం తెలిపారు.

చరిత్ర వక్రీకరణకు బీజేపీ యత్నం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. పట్టణంలోని భీంభవన్ హాల్‌లో శనివారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు బలయ్యారని చెప్పారు. ఇంతకంటే మహోన్నతమైన పోరాటం దేశంలో మరొకటి జరగలేదన్నారు. తద్వారా పేదలకు భూములు పంచిపెట్టి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. ఈ పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. సభలో పార్టీ ఏరియా కార్యదర్శి రాంచందర్, జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు మహిపాల్, చంద్రన్న, ప్రభు, నరేశ్, తుల్జరాం, నర్సింలు, శంకర్, కొడి నర్సింలు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను కాపాడాలి



ఇంద్రకరణ్‌లో జీవవైవిధ్య కమిటీ సభ్యులు

కంది(సంగారెడ్డి): ప్రకృతి సంపదను రక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలని అస్సాం రాష్ట్ర జీవ వైవిధ్య కమిటీ సైన్టిఫిక్ ఆఫీసర్ సునందా పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామాన్ని ఆ రాష్ట్ర వైవిధ్య కమిటీ సభ్యుల బృందం సందర్శించింది. ఇక్కడ జీవ వైవిధ్య విధానం అమలవుతున్న తీరును పరిశీలించింది. ఈ సందర్భంగా సునందా మాట్లాడుతూ, చెట్లను నరకడం, మట్టిని తరలించడం చేయరాదన్నారు. ప్రకృతి సందపను తరలించడం వల్ల వాతావరణంలో మార్పులు వచ్చి మానవాళికి నష్టం వాటిల్లుతుందని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ సైన్టిఫిక్ ఆఫీసర్ శిల్పి, గ్రామపంచాయతీ ఈఓ ఎం. వాణి తదితరులు పాల్గొన్నారు.

బొంతపల్లి, సోలక్‌పల్లికి అవార్డుల ప్రదానం



మంత్రి హరీశ్ నుంచి అవార్డును అందుకుంటున్న సోలక్‌పల్లి సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని సోలక్‌పల్లి, గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్ 2023 కార్యక్రమంలో భాగంగా ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎన్నికయ్యాయి. సంగారెడ్డిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన సోలక్‌పల్లి సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాములుకు, గుమ్మడిదల మండలం బొంతపల్లి సర్పంచ్ నవీన, ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు మంత్రి హరీశ్‌రావు అవార్డులను అందించారు. ప్రతిఒక్కరి సహకారంతో మండలస్థాయిలో గ్రామాలకు ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు రావటం సంతోషంగా ఉందని సర్పంచ్‌లు అన్నారు.



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసన


ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు శనివారం నిరసన తెలిపారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. తమ డిమాండ్‌లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శోభ, విజయలక్ష్మి, గౌరమ్మ, నాగమణి, జగదాంబ, అక్కమహాదేవి, అమృత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు. - జహీరాబాద్ టౌన్



అంగన్‌వాడీల వినూత్న నిరసన

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో చేపట్టిన సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. ఇన్ని రోజులైనా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడాన్ని నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. తమ సమస్యలు న్యాయబద్ధమైనవని వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా నినాదాలిచ్చారు.

- నారాయణఖేడ్



సాయోధులకు సలాం

భూమి కోసం, భుక్తి కోసం.. బానిస విముక్తి కోసం.. బందూకులు పట్టిన నేల ఇది. నిజాం నిరంకుశ పాలనను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాకు చెందిన ధీరులు రజాకార్లకు ఎదురొడ్డి పోరాడారు. ఎందరో ప్రాణాలొదిలి ఉద్యమానికి ఊపిరిలూదారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు కేంద్ర బిందువుగా మారిన పల్లెలు ఎన్నో ఉన్నాయి. నిజాం పాలన నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను అమరుల త్యాగానికి గుర్తుగా సమైక్యతా దినోత్సవం జరుపుకొంటున్న వేళ ఆనాటి వీరుల గాథలతో ప్రత్యేక కథనాలు.. 2లో..

నాటి పోరులో మన ధీరులు

- నిజాం గుండెల్లో రణభేరి మోగించిన మట్టిబిడ్డలు
- అమరుల త్యాగాలకు సాక్ష్యంగా భైరాన్‌పల్లి, పోలంపల్లి గ్రామాలు
- నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 17 వేడుకలు

కాంగ్రెస్‌ది సీజనల్ ప్రేమ

- సీఎం కేసీఆర్‌ది శ్వాశత ప్రేమ
- జగ్గారెడ్డి గెలిచినప్పటి నుంచి అందుబాటులో లేడు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శలు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్/కంది(సంగారెడ్డి)/పుల్కల్(అందోల్): స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి అడ్రస్ లేకుండా పోయారని, గెలిచినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఆయన ఎక్కడున్నాడో కూడా తెలియదని, కనీసం ఫోన్ నంబర్ నియోజకవర్గం ప్రజలకు తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. శనివారం జిల్లాలో ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పటాన్‌చెరువు, సంగారెడ్డి, అందోల్‌లలో మైనార్టీ బంధు, బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దివ్యాంగులకు పెంచిన పింఛన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేశారు. అంతకుముందు కంది మండలం చిమ్నాపూర్, పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టుల్లో చేపపిల్లలను వదిలారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి హరీశ్‌రావు మాట్లాడారు. మెదక్ జిల్లా ప్రజల నోట్లో మట్టి కొట్టి సింగూరు జలాలను హైదరాబాద్ నగరానికి తరలించిన చరిత్ర హస్తం పార్టీదేనని విమర్శించారు. గతంలో జిల్లాలో ఒక్క మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ లేదని, ఇప్పుడు మైనార్టీల కోసం ప్రత్యేకంగా 16 రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ సర్కారుదేనన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్లకు రూ.11,130 కోట్లు

ఇప్పటివరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్లకు కింద ప్రభుత్వం రూ.11,130 కోట్లు ఇచ్చిందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు హైదరాబాద్‌లోనే 2 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండేదని, ఏర్పడిన తర్వాత 6 వేలకు చేరిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పండగ జరుగుతోందని, ఒకేసారి తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభించామన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ను సీఎం ప్రారంభిస్తున్నారని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేయాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు వాడే కరెంట్‌ను కేవలం హైదరాబాద్ ఒక్కటే వాడుతోందన్నారు. నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను బీఆర్‌ఎస్ అందిస్తోందని స్పష్టం చేశారు. మూడోసారి కేసీఆర్‌ను గెలిపించుకుంటే మెట్రో లైన్‌ను పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు తెచ్చుకోగలుగుతామన్నారు. సీఎం ఈ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని, మళ్లీ పటాన్‌చెరులో గూడెం మహిపాల్ రెడ్డిని ఆశీర్వదించాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. చెరువుల్లో వీటిని వదలడం ద్వారా మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించుకున్నామని వివరించారు.

సీఎం దూరదృష్టి..

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో పలు పథకాలు చేపట్టారని తెలిపారు.

కేసీఆర్‌తోనే ప్రజల జీవితాల్లో వెలుగులు

జీవితాల్లో వెలుగులు నింపే బీఆర్‌ఎస్ కావాలో? అరచేతిలో వైకుంఠం చూపించి తాత్కాలిక ప్రయోజనాలు కల్పించే కాంగ్రెస్ కావాలో? ఆలోచించాలని ప్రజలకు మంత్రి హరీశ్ సూచించారు.

అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో..

: చింతా ప్రభాకర్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతోందని, 70 ఏళ్లలో జరగని అభివృద్ధి కేసీఆర్ పాలనలో ఈ పదేళ్లలో జరిగిందని రాష్ట్ర హ్యాండ్‌లూం కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. గతంలో సబ్సిడీ యూనిట్ల కోసం లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఎలాంటి సబ్సిడీలు, బ్యాంకులతో లింకులు లేకుండా ఉచితంగా దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు వంటి పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకే ఆర్థికసాయం అందుతోందన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచితవిద్యుత్ ఇస్తున్న ఘనత ఒక్క తెలంగాణదేనన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ ఏ.శరత్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దచల్మెడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పారామెడికల్ కాలేజీ మంజూరు

సంగారెడ్డికి పారామెడికల్ కాలేజీని మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ మంజూరైందని, అనుబంధంగా నర్సింగ్ కాలేజీని కూడా సీఎం మంజూరు చేశారని వివరించారు. పారామెడికల్ కాలేజీ మంజూరుతో అన్ని రకాల కోర్సులు ఇక్కడే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ రమణకుమార్



ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ : ఈనెల 18న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, అలాగే మిలాద్ ఉన్ నబీ ఉన్నందున ఆయా పండుగలను ప్రజలు మతసామరస్యంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రమణ కుమార్ కోరారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మండపాలను ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు పోలీసు వారికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేస్తారన్నారు. ఆ తరువాతనే వీటిని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రదేశ వివరాలతోపాటు నిమజ్జనం చేసే రోజు, సమయం, రూటు వంటి వివరాలను కూడా నమోదు చేయవలిసి ఉంటుందన్నారు. మైక్‌లు, స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదన్నారు. మండపాల వద్ద రాత్రి సమయంలో కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వలంటీర్లు ఉండేలా చూసుకోవాలని వివరించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే డయల్ 100 కు గానీ, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని చెప్పారు.

108 కానిస్టేబుల్స్‌కు పదోన్నతి

జిల్లాకు చెందిన 108 మంది కానిస్టేబుల్స్.. హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారు. శనివారం సంగారెడ్డి ఎస్పీ రమణ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన వారు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామపంచాయతీ స్థాయిలో వెంచర్‌కు ప్లాన్!

- ఆరు ఎకరాల విలువ సుమారు రూ.40 కోట్లు
- హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తున్న గడ్డపోతారం
- లాభాలు తగ్గుతాయని సంస్థ ప్రతినిధులు, జీపీ అధికారుల కుమ్మక్కు
- నిర్మాణాలు లేకుండా ఇంటి నంబర్లు కేటాయింపు, రిజిస్ట్రేషన్లు
- భూమి యజమానుల మధ్య గొడవతో విషయం బయటికి..



ఇంటి నిర్మాణాలు లేకుండా ఖాళీగా ఉన్న భూమి ఇదే

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటి నిర్మాణాలు లేకుండానే డబ్బులకు కక్కుర్తి పడి ఏకంగా ఇంటి నిర్మాణ అనుమతులతో పాటు, ఇంటి నంబర్లను కూడా కేటాయించారు. రింగురోడ్డుకు సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు రెక్కలొచ్చాయి. నిబంధనలను పాటించకుండా అడ్డదారిలో డబ్బులను సంపాదించే దిశగా అక్రమార్కులు చర్యలు ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయతీ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కుమ్మక్కై నిర్మాణాలు లేకుండా ఇంటి నంబర్లను కేటాయించడంతోపాటు రిజిస్ట్రేషన్‌లు కూడా చేశారు. విషయం బయటకు పొక్కడంతో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. మండలంలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని గడ్డపోతారం, చెట్లపోతారం గ్రామాల్లోని 80, 83, 84, 85, 89, 72, 86/ఏ, 86/ఏఏ, 86/ఈ సర్వే నంబర్‌లలో 6 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇది యలమంచిలి గంగాధర్‌కు చెందినది. ఆయనకు బ్యాంక్ రుణం ఉండగా ఏడాది క్రితం జరిగిన వేలంలో స్థలాన్ని ఓ డెవలపర్స్ సంస్థ ప్రతినిధులు దక్కించుకుంది. గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధి పూర్తిగా హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తుంది. వెంచర్‌ను ఏర్పాటు చేయాలంటే ఎక్కువ స్థలాన్ని రోడ్లు, ఇతర అవసరాల కోసం వదిలేయాల్సి ఉంటుంది. దీంతో లాభాలు తక్కువగా వస్తాయనే దురుద్దేశంతో సంస్థ ప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై గ్రామ పంచాయతీ స్థాయిలో వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు పన్నాగం పన్నారు. నిర్మాణాలు లేకుండానే ఇంటి నంబర్లను తీసుకునే ప్రక్రియను మొదలు పెట్టారు. వీటి ఆధారంగా సంగారెడ్డిలో రిజిస్ట్రేషన్‌లు చేయటమూ ప్రారంభించారు. గ్రామపంచాయతీ అధికారులు 35 ఇంటినంబర్లను కేటాయించగా, వీటికి బై నంబర్లు వేస్తూ ఏకంగా 90 ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. ఒక్కో ఇంటి నంబర్‌కు అధికారులు రూ. 2లక్షల వరకు వసూలు చేసినట్లు విమర్శలున్నాయి. భూమి యజమానుల మధ్య గొడవలు రావటంతో ఈ విషయాలు బయటకు వచ్చాయి. దీంతో ఈ భూమిలో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు.

భూములకు విలువ ఎక్కువ

గడ్డపోతారం, చెట్లపోతారం గ్రామాలు రింగురోడ్డుకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఇక్కడ ఎకరం రూ.7కోట్ల వరకు ఉంటుంది. రూ.40కోట్ల విలువైన భూమిలో నిబంధనలు పాటించకుండా ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకునే పనిలో కొందరున్నారు. ఇలాంటి భూముల్లో నిర్మాణాలు చేపట్టేటప్పుడు అధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికే విచారణ ప్రారంభించిన అధికారులు

పై గ్రామాల పరిధిలో నిర్మాణాలు లేకుండా ఇంటి నంబర్లను కేటాయించే విషయమై డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, ఎంపీఓ సంతోష్‌లు విచారణ జరిపారు. జీపీకి సంబంధించిన కీలక రికార్డులను అధికారులు సీజ్ చేశారు. జిల్లా అధికారులు.. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు కూడా నోటీసులను జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికలను అందించాలని కలెక్టర్, ఆయా శాఖల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

రికార్డులను సీజ్ చేశాం

గడ్డపోతారంలో ఇంటి నంబర్ల కేటాయింపు విషయమై ఫిర్యాదులొచ్చాయి. ఈఓతోపాటు స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులతో విచారణ చేపట్టాం. గ్రామపంచాయతీలో ఉన్న కీలక రికార్డులను సీజ్ చేశాం. వెంచర్ చుట్టూ ఉన్న ప్రహరీ నిర్మాణాలను కూల్చివేయించాం. ఉన్నతాధికారులకు పూర్తి నివేదికలు అందిస్తాం. తదుపరి చర్యలు చేపడతాం.

సతీశ్‌రెడ్డి, డీఎల్‌పీఓ

161 జాతీయ రహదారి అభివృద్ధి పీఎం చలవే

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సమగ్ర అభివృద్ధికి సంగారెడ్డి– నాందేడ్– అకోలా 161 జాతీయ రహదారి నిదర్శనమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో శనివారం పార్టీ సమావేశాన్ని ముగించుకొని ఆయనతోపాటు ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాష, రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ హైదరాబాద్ వెళుతుండగా నిజాంపేట్ వద్ద ఆగారు. ఈ సందర్భంగా వీరిని రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప సన్మానించారు. ఆపై తేనేటి విందునిచ్చారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ హయాంలో జాతీయ రహదారులకు మహర్దశ పట్టిందని అన్నారు. సంగప్పను అడిగి ఖేడ్ రాజకీయ పరిస్థితులను తెలుసుకున్నారు. కేంద్రప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో చేసిన పనులను జన్‌వాడే వివరించారు. సీనియర్ నాయకులు సాయిరాం, గుర్రపు నరేందర్, సుధాకర్, సంజయ్ పాటిల్, రాజుగౌడ్, పట్నం మాణిక్, అజయ్, సతీశ్, మహిపాల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

సంగారెడ్డి మున్సిపాలిటీ : సంగారెడ్డికి పారామెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించడంపై హ్యాండ్లూమ్ చైర్మన్ చింతా ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం మంత్రి జిల్లా పర్యటనలో ప్రకటన చేయడం సంతోషదాయకమన్నారు. కాలేజీ ఏర్పాటు చేయాలని ఆయనకు పలుమార్లు విన్నవించినట్లు చెప్పారు.

నేడు మెగా వైద్యశిబిరం

జహీరాబాద్: పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో అగర్వాల్ సేవాదళ్ అండ్ బద్రి విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో కృత్రిమ అవయవాలు, కంటి, గుండె పరీక్షలు, ఈఎన్‌టీ తదితర వైద్య పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లను పరిశీలించారు.

సాయోధులకు సలాం

- పోరాటాలకు పుట్టినిల్లు ఉమ్మడి జిల్లా
- రజాకార్ల ఆగడాలను ఎదురించిన వీరులు
- నేలకొరిగిన ఎందరో అమరులు


వీర బైరాన్‌పల్లి బురుజు వద్ద వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మద్దూర్/హుస్నాబాద్‌రూరల్: నిజాం ఆగడాలకు ఎదురొడ్డి నిలిచారు హుస్నాబాద్ పోరు బిడ్డలు. రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన పోరులో వీర బైరాన్ పల్లి మహ్మదాపూర్ భూషనగట్టు గ్రామ ప్రజలు ఎందరో అమరులయ్యారు. ముస్లీంలు అధికంగా ఉన్న మద్దూరు, లద్నూర్, సలాఖపూర్, రేబర్తి, మర్మాముల గ్రామాలను రజాకార్లు తమ స్థావరాలుగా చేసుకొని దాడులు చేస్తుండే వారు. ఈ క్రమంలో బైరాన్‌పల్లి గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని రజాకార్ల దాడులను తిప్పి కొట్టడంలో చుట్టు పక్కల గ్రామాలు కీలక పాత్ర పోషించాయి.

అనాటి పేదల భూములకు చిక్కులే..

నిజాం ప్రభుత్వ కాలంలో హుస్నాబాద్ ప్రాంతంలో సాగు భూములు భూస్వాముల చేతుల్లోనే ఉండేవి. అక్కన్నపేట చొక్కరావుకు వందల ఎకరాల భూమి ఉంటే.. అందులోనే కూలీలు పనులు చేసుకొని జీవనం సాగించేవారు. సాయుధ దళాల తిరుబాటుతో చొక్కారావు లాంటి భూస్వాములు గ్రామం విడిచి ఆంధ్రాకు పారిపోయారు. అల్లర్లు సద్దుమణిగిన తర్వాత గ్రామానికి వచ్చిన అతని భూములను చాలామందికి అప్పగించాడు. 1977లో సీలింగ్ చట్టం రావడంతో వందల ఎకరాలు పేదలకు సీలింగ్ కింద ఇవ్వగా 600 ఎకరాల వరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. గండిపెల్లి, నందారం, ఫకీర్‌నాయక్ తండా ప్రాంతంలో అప్పటి రికార్డుల్లో ముస్లీంల పేరున 200 ఎకరాల వరకు ఉండటంతో, నిజాం పాలన తర్వాత వారు ఊరు విడిచి వెళ్లడంతో వాటిని గిరిజనులు, పేదలు స్వాధీనం చేసుకుని సాగు చేస్తున్నారు. ధరణి ఆన్‌లైన్‌లో చేయడానికి ముందు చాలావరకు ఆర్వోఆర్ ద్వారా పట్టాలు ఇచ్చిన కొందరికి పట్టాలు కాలేదు. భూ రికార్డుల్లోని యాజమానులు ఇక్కడ లేకపోవడంతో దాదాపు 150 ఎకరాలకు పైగా పేదల భూములు ప్రశ్నార్థకంగానే మారాయి. మా భూములను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామస్తులు గత పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తే అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి వరకు పట్టించుకోలేదు.

నాటి వీరులు...

పోలంపల్లి అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతి రెడ్డిల దళాలు రజాకార్లతో పోరు చేస్తూ మహ్మదాపూర్‌కు చేరుకున్నాయి. 14 మార్చి 1948లో మహ్మదాపూర్‌లో సమావేశమైన విషయం తెలుసుకుని రజాకార్లు ఊరిని చుట్టుముట్టిన దాడులు చేశారు. సాయుధ దళాలు భూషనగట్లకు చేరుకునే సమయంలో రజాకార్లు జరిపిన కాల్పుల్లో 12 మంది వీర మరణం పొందారు. బైరాన్‌పల్లి, కూటిగల్, లింగాపూర్, దూల్మిట్ట గ్రామాలలో ఏర్పడిన రక్షణ దళాలు బైరాన్‌పల్లిని కేంద్రంగా చేసుకుని రజాకార్ల దాడులను తిప్పి కొట్టేవి. దీనితో రజాకార్లు 1948లో దూల్మిట్ట,లింగాపూర్ గ్రామాలపై దాడులు చేసిదొరికిన వారిని దొరికినట్లు చంపడంతో పాటు ఆయా గ్రామాలను తగుల బెట్టారు. ఆపై తిరిగి వస్తున్న రజాకార్లపై బైరాన్‌పల్లి వద్ద రక్షణ దళాల నాయకులు దువ్వూరి రాంరెడ్డి, మురళీధర్‌రావు, ముకుందర్ రెడ్డి నాయకత్వంలో కాపుకాచి గెరిల్లా దాడులు చేశారు. అంతే కాకుండా లింగాపూర్ దూల్మిట్ట గ్రామాలలో దోచుకున్న సంపదను స్వాధీనం చేసుకున్నారు.

బైరాన్‌పల్లి దిగ్బంధం

బైరాన్‌పల్లి గ్రామ రక్షక దళాలు దాడులు చేయడంపై రజాకార్లు ఆగ్రహించి ఆ గ్రామంపై మూడు సార్లు దాడులు చేసి విఫలమయ్యారు. ఈ క్రమంలో 1948 ఆగస్టు 27వ తేది అర్ధరాత్రి ఖాసీం రజ్వీ నాయకత్వంలో రజాకార్లు జనగామ నుంచి 10 ట్రక్‌లతో బయల్దేరి రాత్రి 2గంటల ప్రాంతంలో లద్నూర్ గ్రామానికి చేరుకున్నారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో బైరాన్‌పల్లి గ్రామానికి మందుగుండు సామగ్రితో 1200 మంది సైనికులు దిగ్బంధించారు. బహిర్భూమికి వెళ్లిన ఉల్లెంగల(వడ్ల) నర్సయ్యను పట్టుకొని గ్రామంలో ఉన్న బురుజు వద్దకు దారి చూపించమని తీసుకు వెళ్లారు. అదే సమయంలో నర్సయ్య వారిని నెట్టివేస్తు రజాకార్లు గ్రామంలోకి వచ్చారని కేకలు వేస్తు పరుగులు తీశాడు. దీనితో బురుజుపై ఉన్న కాపాలాదారుడు నగారా మోగించగా రజాకార్లు కాల్పులు ప్రారంభించింది. బురుజుపై ఉన్న మోటం రామయ్య, పోచయ్య, బలిజ భూమయ్యలు మృతి చెందారు. కాల్పులు జరుగుతుండగా బురుజుపై ఉన్న మందు గుండు సామగ్రిపై నిప్పు రవ్వలు ఎగిసి పడటంతో ఒక్కసారిగా బురుజుపైభాగం పేలిపోయింది. దీంతో రజాకార్లు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు కాల్చి చంపారు. ఈలా ఒకే రోజు బైరాన్‌పల్లి గ్రామంలో 96మందిని చంపి గుట్టలుగా శవాలను పేర్చారు. వాటి చుట్టూ మహిళలతో బతుకమ్మ ఆటలాడించినట్లు చరిత్ర చెప్పుతుంది.బైరాన్‌పల్లి గ్రామ రక్షక దళాలకు సహకరిస్తున్నారని కూటిగల్‌కు చెందిన 22 మందిని రజాకార్లు కాల్చిచంపారు.


కూటిగల్ గ్రామంలోని బురుజు

ప్రత్యేక రక్షక దళాలతో..


చోళ లింగయ్య

మెదక్: పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన చోళ లింగయ్య స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఎయిర్‌ఫోర్స్ విభాగంలో గ్రౌండ్ ఇంజినీర్‌గా పని చేశారు. సుభాష్ చంద్ర బోస్ పిలుపుమేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి ఆజాద్ హింద్ ఫౌజ్‌లో భాగమయ్యారు. బోస్ మరణించాక తిరిగి తెలంగాణకు వచ్చారు. అప్పటికే ఈ ప్రాంతంలో రజాకార్ల వికృత చేష్టలకు అంతేలేకుండా పోయింది. ఆర్మీలో పనిచేసిన అనుభవంతో రజాకారుల దాడులను తిప్పికొట్టేందుకు లింగయ్య ప్రత్యేక రక్షక దళాలను ఏర్పాటు చేశారు. నాటు తుపాకులు, బాంబులు సొంతంగా తయారు చేయించారు. 1947 ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని మెదక్‌లోని పటేల్ కుంటలో ఎగురవేశారు. దీంతో నిజాం ప్రభుత్వం అతనికి అరెస్ట్ వారెంట్ జారీ కాగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో పోలీసులు లింగయ్యను పట్టుకుని తాళ్లతో బంధించి మెదక్ పట్టణంలో తిప్పి ఏడు నెలలపాటు ప్రస్తుత మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జైలు నిర్బంధించారు. అనంతరం సర్దార్‌పటేల్ మిలటరీ యాక్షన్‌తో జైలు నుంచి బయటకు వచ్చారు.

అన్నదమ్ముల పోరు


బట్టి కిష్టయ్య

మెదక్ పట్టణంలోని అరబ్ గల్లీకి చెందిన అన్నదమ్ములు బట్టి కిష్టయ్య, బట్టి వెంకయ్య. వీరితో పాటు కేవల్ కిషన్, బళ్లాల బాబయ్య, సిల్వర్ రాజయ్య, గంగారం ఈశ్వరయ్య, గులాం దస్తగిరి తదితరులు కమ్యూనిస్టులు అజ్ఞాతంలో ఉంటూ రజాకార్లపై తిరుగుబాటు మొదలెట్టారు. 1942లో మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా నినాదానికి స్పందించారు. పాతికేళ్ల వయసులోనే బట్టి కిష్టయ్య 80 మంది సభ్యులతో బాలభారతి మండలిని స్థాపించారు. రాత్రి పాఠశాలలు నెలకొల్పి, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడంతో బానిసత్వాన్ని పారదోలేందుకు తనవంతు కృషి చేశారు. బోర్‌తుపాకులు చేతపట్టి రజాకార్లపై తిరుగుబాటు చేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే అరబ్‌గల్లికి రజాకార్లు రావాలంటేనే జంకేవారట.

గొల్లపల్లి.. పోరాటాల అడ్డా


గొల్లపల్లి గ్రామం

జగదేవ్‌పూర్(గజ్వేల్): నిజాంకు, రజాకార్లకు ఎదురు తిరిగిన గడ్డ గొల్లపల్లి గ్రామం. నల్లగొండ జిల్లా కొలనుపాకకు చెందిన ఆరుట్ల రాంచంద్రారెడ్డి తెలంగాణ సాయుధపోరాటంలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఆరుట్ల నర్సింహారెడ్డి గొల్లపల్లికి వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న రజాకార్లు గొల్లపల్లి బాట పట్టారు. గ్రామస్తులు నర్సింహారెడ్డి, లింగారెడ్డి, రాజిరెడ్డి, బాలయ్య, చంద్రారెడ్డి, పాపయ్య, హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డిలు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. వీరి కోసం రజాకార్లు, నిజాం పాలకులు ఊరిపై దాడులకు దిగారు. ఈ సమయంలోని మండలంలోని ఇటిక్యాల, తిగుల్, అంగడికిష్టాపూర్‌లో బురుజులు నిర్మించారు. ఆ గ్రామాల్లో ఇప్పటికీ ఉన్నాయి. ఇటిక్యాల కోట మాదిరిగా నిర్మించారు. బురుజులపై నిలబడి ఊరికి ఎవరెవరు వస్తున్నారని పరిశీలించేవారు. గొల్లపల్లికి చెందిన 8 మంది, చిన్నకిష్టాపూర్ గ్రామ సమీపంలో తలదాచుకునే వారు. విషయం తెలుసుకున్న రజాకార్లు వారిని పట్టుకుని మొదట సంగారెడ్డి జైలుకు, అక్కడి నుంచి చంచల్‌గూడ జైలుకు పంపించారు. 10 నెలలు జైలు జీవితం అనుభవించారు. వీరిలో నలుగురి స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి పింఛన్ కూడా అందించారు. ప్రస్తుతం వారు ఎవరు బతికి లేరు. ఇద్దరు కుటుంబాల భార్యలు మాత్రమే గ్రామంలో ఉంటున్నారు. శశికళ, యాదమ్మలు వృద్ధాప్యంలో ఉన్నారు.


యాదమ్మ

రజాకార్లను తరిమిన సైన్యం

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దులో కర్ణాటకలోని బొంగూరు గ్రామం వద్ద సైన్యాన్ని రజాకార్లు అడ్డుకున్నట్లు తమ పెద్దలు చెప్పారని సమీప గ్రామ ప్రజలు తెలిపారు. 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు భారత సైన్యం మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి జహీరాబాద్ మీదు గా హైదరాబాద్ వెళ్లే క్రమంలో కర్ణాటకలోని బీదర్ జిల్లా బొంగూర్ వద్ద నల్ల రొతుతో నిర్మించిన బ్రిడ్జిపై రజాకార్లు అడ్డగించారు. భారత సైన్యం చేసిన దాడికి రజాకార్లు పారిపోయారు. కోహీర్ మండలం కవేలి క్రాస్‌రోడ్డు వద్ద 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎత్తైన ప్రదేశం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన కోహీర్ వైపు ఫిరంగులు పేల్చడంతో రజాకార్లు వెనుదిరిగారు.

ఉద్యమ గడ్డ రాయికోడ్

రాయికోడ్(అందోల్): తెలంగాణ సాయుధ పోరాటంలో మేము సైతం అంటూ రాయికోడ్ వాసులు కదం తొక్కారు. సాయుధ పోరాటానికి మద్దతుగా సాగిన ఆర్యసమాజ్ వారి ర్యాలీ గ్రామానికి ఆహ్వానించారు. నిజాం సర్కారులోని హద్నూర్ అమీన్‌సాబ్ ర్యాలీకి అనుమతివ్వలేదు. నిషేధాజ్ఞలు లెక్కచేయకుండా గ్రామంలోని గౌని ప్రాంతానికి ర్యాలీ చేరుకోగానే రజాకార్లు ఉద్యమకారులపై కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో 14 మంది అమరులయ్యారు. ర్యాలీలో పాల్గొన్నందుకు 8 మందికి నిజాం ప్రభుత్వం జైలు శిక్ష విధించింది. రజాకారులు ఇళ్లలో ధనం, ధాన్యం లూటీ చేశారు.


కాల్పులు జరిగిన గౌని ప్రాంతం

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి



రజాకారుల దాడిలో కుటుంబ సభ్యుల ప్రాణాలతో పాటు సర్వం కోల్పోయిన అమరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించకపోడం శోచనీయం. అమరుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతీ నెల రూ.10వేల పింఛన్ అందించాలని వీరబైరాన్ పల్లిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి, గత చరిత్రను భవిష్యత్ తరాలకు తెలిపాలి.

-బండి శ్రీనివాస్‌గౌడ్ సర్పంచ్ (బైరాన్‌పల్లి)

ఊరంతా వల్లకాడైంది...



రజాకార్ల దాడిలో బైరాన్‌పల్లి ఊరంతా వల్లకాడైంది. ఊరి మీదపడి ఇష్టమొచ్చిన రీతిగా దోపిడీ చేశారు. మహిళలను చిత్రహింసలు పెట్టారు. బురుజు వద్ద అనేక మందిని పట్టుకొని చంపుతుంటే భయంతో పరుగులు పెడుతున్న మహిళలను వివస్త్రలను చేసి శవాల చుట్టూ బతుకమ్మ ఆట ఆడించి పైశాచిక ఆనందం పొందారు. కొందరు మహిళలను అత్యాచారం చేశారు. ఆరోజు ఎటూ చూసి ఊరంతా శవాలతో నిండి పోయింది.

– జంగిటి లచ్చవ్వ, బైరాన్‌పల్లి

పెన్షన్లు మంజూరు చేయాలి



రజాకార్ల దాడి సమయంలో అప్పుడు నేను యువకుడిని. గ్రామ రక్షక దళం ఆధ్వర్యంలో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ప్రత్యేకంగా పాల్గొన్న. ఆ సంఘటనను గుర్తు చేసుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది. సమరయోధులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి. బైరాన్‌పల్లి పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు నాటి పోరాట ఘట్టాన్ని పాఠ్యంశాల్లో చేర్చడంతో పాటు స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలి.

– చల్లా చంద్రరెడ్డి, బైరాన్‌పల్లి.

వీరన్నపేట వీరులు


అరిగె లచ్చయ్య

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాటంలో మండల పరిధిలోని వీరన్నపేట గ్రామం చెరగని ముద్ర వేసింది. రజాకార్లను ఎదుర్కొనే క్రమంలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను గడ్డివాములో వేసి సజీవ దహనం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సంఘటన గ్రామానికి చెందిన అరిగే మల్లయ్యను అతని సోదరుడు అరిగే లచ్చయ్యలను కలచివేసింది. వారిద్దరూ రజాకార్ల వ్యతిరేకంగా పోరాటం చేశారు. అరిగే మల్లయ్య రజాకార్లతో జరిగిన పోరాటంలో తుపాకీ తూటాలకు బలికాగా, లచ్చయ్యను గ్రామ శివారులో రజాకార్లు చుట్టుముట్టి కాల్చారు. చనిపోయాడనుకుని రజాకార్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే కొన ఊపిరితో ఉన్న అరిగె లచ్చయ్యను గ్రామస్తులు కొన్నె గ్రామానికి తీసుకువెళ్లి నాటి కమ్యూనిస్టు నేత కుర్రారం రామిరెడ్డి సహాయంతో బతికించుకున్నారు. ఇలా వీరన్నపేట గ్రామం సాయుధ పోరాటంలో తన వంతుగా ముందుండి నిజాం సర్కారు, రజాకార్లను ఎదుర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్న శంకరంపేట మండలం మడూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన భూపాల కిష్టయ్య(45) మడూర్ గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఎల్లమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కిష్టయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నారాయణగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడు..

పటాన్‌చెరు టౌన్: ట్యాంకర్ లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు. బొల్లారం వినాయకనగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్(29) స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా గండీగూడ కాలనీ వద్ద రెడీమిక్స్ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ తల పూర్తిగా నుజ్జయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు.

చెరువులో పడి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం జగదేవ్‌పూర్‌లో శనివారం జరిగింది. ఎస్‌ఐ చంద్రమోహన్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాగుల కిష్టయ్య(52) మేస్త్రి పనులు చేస్తుంటాడు. ఇతని బంధువు రాగుల సాయికుమార్ ఇటీవల మృతి చెందాడు అతని పెద్దకర్మ కార్యక్రమంలో భాగంగా శనివారం రెడ్డమైన చెరువు వద్ద స్నానానికి వెళ్లారు. బట్టల కోసం కట్టపైకి వస్తున్న క్రమంలో కిష్టయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీస్ ఉద్యోగం వద్దన్నందుకు..

వివాహిత ఆత్మహత్య

నంగునూరు(సిద్దిపేట): ఉద్యోగం చేయొద్దన్నారని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి గట్లమల్యాలలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా వీనవంక మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన మార్త రాజయ్య కూతురు కల్యాణి(24)తో గట్లమల్యాలకు చెందిన కారు హరీష్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఎంబీఏ పూర్తి చేసిన కల్యాణి వివిధ పోటీ పరీక్షలు రాయగా కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తైంది. పోలీస్ ఉద్యోగం వద్దని భర్త హరీష్, అత్త రమణ, మరిది శ్రీహరి కొన్ని రోజులుగా వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన కల్యాణి శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. కాగా కల్యాణి రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థి

పుల్‌కల్(అందోల్): వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థి శనివారం ఇంటి సమీపంలోని పొదల్లో శవమై కనిపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భార్గవ ప్రసాద్(13) పుల్‌కల్ మండలం సింగూరు గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. విద్యార్థికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థి తిరిగి రాలేదు. పాఠశాలకు కూడా వెళ్లలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఇంటి సమీపంలోని పొదల్లో దుర్గంధం వస్తుండటంతో వెళ్లి చూడగా భార్గవ ప్రసాద్ ఉరి వేసుకుని కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. ఇంటి నుంచి వెళ్లిన రోజే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నెల రోజుల నుంచి పాఠశాలకు రావడం లేదని సింగూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట కొత్త తరహా సైబర్ మోసాలు జరుగుతున్నాయని.. నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ.. ఫోన్లకు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లకు వచ్చే లింక్స్‌ను ఓపెన్ చేయకూడదని సూచించారు. క్లారిజ్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, ఇంటి వద్ద నుంచే పని చేయవచ్చని గుర్తు తెలియని వ్యక్తులు లింకులు పంపుతున్నారని తెలిపారు. గూగుల్ మ్యాప్ రివ్యూ రేటింగ్ గురించి పని ఉంటుందని, ఒక్క రివ్యూకు రూ.210 చెల్లిస్తామని, తాము ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే రూ.3,400 తో పాటు అదనంగా రూ.5వేలు చెల్లిస్తామని మాయ మాటలతో నమ్మిస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో పడకూడదని సీపీ సూచించారు.

బాలిక అదృశ్యం

నర్సాపూర్‌రూరల్: పదకొండేళ్ల బాలిక కనిపించకుండా పోయిన సంఘటన నర్సాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఏర్పుల రాములమ్మ, పోచయ్య దంపతుల కూతురు సంధ్య ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామంలోని దుర్గమ్మ ఆలయ తలుపులు పగులగొట్టిన దుండగులు హుండీని ఎత్తుకెళ్లి సిబ్బి తండ శివారులో పడేశారు. శనివారం ఉదయం అర్చకుడు గుడికి వెళ్లేసరికి ఆలయ తలుపులు ధ్వంసమై ఉండటం చూసి విషయాన్ని సర్పంచ్ కూకట్ల బాలరాజు తెలియజేశాడు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. హుండీలో సుమారు రూ.12వేల నగదు అపహరించినట్లు వారు తెలిపారు. అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలిసులు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


నాటుసారా, బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

60లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 5వ తేదీన 'గుప్పుమంటున్న గుడుంబా'...గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు అనే శీర్షికన సాక్షి తెలుగు దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సీహెచ్ పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ సహకారంతో అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హెన్యానాయక్‌తండా, మంజ్యానాయక్‌తండా, ధాక్యానాయక్‌తండా, పంచరాయితండాలతో పాటు దుబ్బతండా గ్రామ పరిధిలోని రాజుతండా, వంకాయతండా, దాస్‌తండాలలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 7లీటర్ల నాటుసారా, 60లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. గుడుంబా తయారీని మానుకోవాలని, లేకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా అక్కన్నపేట మండలాన్ని గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దుతామని, ఆ దిశగా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ ఎస్సై కె.శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై మెదక్ ఎ.రజిత, ఎస్.దామోదర్, అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన డీఆర్‌డీఓ


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా

సిద్దిపేటరూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నూతన అధికారిగా నియామకమైన జయదేవ్ ఆర్యా శనివారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లా అదనపు డీఆర్‌డీఓగా బాధ్యతలు నిర్వర్తించిన జయదేవ్ ఆర్యా పదోన్నతిపై సిద్దిపేట జిల్లాకు వచ్చారు.